ప్రజాశక్తి
బుధవారం 14 ఫిబ్రవరి 2024
5
శ్రీకాకుళం

నేడు శాస్త్రీయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో 42వ శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కె.భాగ్య లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా స్థానం అనకాపల్లి విస్తరణ ఉపసంచాలకులు డాక్టర్ ముకుందరావు, సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి.కె జగన్నాథరావు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో 2024-25కు కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు.

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో...

జిల్లా విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మెరుగైన ర్యాంకులు సాధించి సత్తా చాటారు. సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలోని వైటిసిలో నిర్వహిస్తున్న ఐఐటి సూపర్-60 విద్యార్థులు 30 మంది మెయిన్స్ పరీక్షలకు హాజరు కాగా 20 మంది జెఇఇ అ.డ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. వీరిలో ఆరుగురికి ఆలిండియా స్థాయిలో ప్రముఖ కళాశాలల్లో ఎన్ఐటి ప్రవేశానికి అవకాశం ఉందని కళాశాల కోర్స్ డైరెక్టర్ మురళీబాబు తెలిపారు. కొత్తూరు ఉపేంద్ర 88.98 శాతం, గేదెల చైతన్య 87.14 శాతం, ఆరిక ప్రశాంత్ 83.96శాతం, సవర స్రవంతి 78.07 శాతం, బిడ్డిక ఫ్రాన్సిస్ 75.79 శాతం, సవర అభి 71.50 శాతం మార్కులు సాధించారని చెప్పారు.

ఈ ఏడాది ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కోర్సు ఆలస్యంగా ప్రారంభించామని, ఐదు నెలల్లోనే 20 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడం గొప్ప విషయమని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు, బోధనా సిబ్బందిని ఆమె అభినందించారు. రాష్ట్రంలో ఐటిడిఎల్లో సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సూపర్-60 ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

శభాష్ సాయికుమార్

సంతబొమ్మాళి : మండలంలోని అంట్లవరానికి చెందిన కప్పల సాయికుమార్ 99.57 శాతం మార్కులతో సత్తా చాటాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు శ్రీకాకుళంలోని గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీలో, ఇంటర్మీడియట్ రాజమండ్రిలోని తిరుమల విద్యాసంస్థల్లో చదవుతున్నాడు. తల్లిదండ్రులు మల్లేష్, లక్ష్మి హైదరాబాద్‌లో భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. సాయికుమార్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మెరిసిన సాయిస్ఫూర్తి

కవిటి : మండలంలోని బల్లిపుట్టుగకు చెందిన మార్పు సాయిస్ఫూర్తి 97.085 శాతంతో సత్తా చాటింది. సాయి స్ఫూర్తి తండ్రి వెంకటేష్ వ్యవసాయం చేస్తుండగా తల్లి బిందుమాధవి ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తోంది. సాయి స్ఫూర్తి ఒకటి నుంచి 8వ తరగతి వరకు కవిటిలోని కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో చదవగా, 9, 10 తరగతులు బొరివంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది.

సాధించిన సరయు

కంచిలి : కంచిలికి చెందిన వూన సరయు 96.13 శాతం మార్కులు సాధించింది. సరయు పదో తరగతి కంచిలిలోని జెఎంజె ప్రైవేట్ పాఠశాలలో చదవగా, రాజమండ్రిలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. తండ్రి శ్రీకాంత్ కిరాణా వ్యాపారం కాగా, తల్లి అంబిక గృహిణి. సరయును తల్లిదండ్రులతో పాటు స్థానికులు అభినందించారు.

అన్నదమ్ముల సత్తా

టెక్కలి : టెక్కలికి చెందిన అన్నదమ్ములు డోకి విమలేష్, కమలేష్ జెఇఇ ఫలితాల్లో సత్తా చాటారు. కమలేష్ 99.1 శాతం మార్కులు సాధించగా, విమలేష్ 98.1 శాతం మార్కులు సంపాదించాడు. వీరు పదో తరగతి వరకు మండలంలోని సీతాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియట్ ఒక కార్పొరేట్ కళాశాలలో చదివారు. తండ్రి డోకి సురేష్ హోల్‌సేల్ కిరాణా దుకాణం నడుపుతుండగా, తల్లి భవాని గృహిణి.

చక్రధర్ కళాశాల విద్యార్థుల సత్తా

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో శ్రీకాకుళం నగరంలోని చక్రధర్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల నుంచి 50 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 17 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని కళాశాల చైర్మన్ యాళ్ల చక్రధర్ తెలిపారు.

విజేతలుగా నిలిచిన కాకినాడ ఆదిత్య విద్యార్థులు

'కాకినాడ ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. బి.స్వర్ణశ్రీ 99.35 శాతం మార్కులు సాధించగా, ఎం.ప్రవల్లిక 99.26 శాతం మార్కులు సాధించింది. వీరితో పాటు 15 మంది విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించారు. వీరంతా అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లేశ్వరరావు తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి ఎన్.కె దీపక్ రెడ్డి, డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి అభినందించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలి
- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బంద్ జయప్రదం చేయాలని కోరుతూ నగరంలోని ఎన్‌జిఒ హోం నుంచి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. మరోవైపు మత వైషమ్యాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలికలు తెస్తోందన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్నా రైతాంగ, కార్మిక, ప్రజల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. నేడు ఉద్యోగ కల్పన పడిపోయిందని, నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరిందని విమర్శించారు. శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గిపోయాయని తెలిపారు.

మానవాభివృద్ధిలో ప్రపంచంలోని 191 దేశాల్లో ఇండియా 132వ స్థానంలో ఉందని, సంతోష జీవన సూచీలో 160వ స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు కనీవినీ ఎరుగని రీతిలో పెరిగాయన్నారు. స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదవారి బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామన్న మాటను మోడీ మర్చిపోయారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తోందని విమర్శించారు. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థల్లో వంద శాతం వాటాలు తెగనమ్ముతోందన్నారు. ఉద్యోగుల కష్టార్జితమైన పిఎఫ్, పెన్షన్ నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కట్టబెడుతోందని చెప్పారు. కార్మికులు, మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులు పాలసీదారులుగా ఉన్న ఎల్ఐసి వాటాలను అమ్మేందుకు తెగబడిందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందన్నారు.

సమ్మె హక్కును కాలరాస్తోందని, పిఎఫ్, ఇఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తోందని తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి తేవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఇపిఎస్ పెన్షన్ నెలకు రూ.పది వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. దేశంలో సుమారు కోటి మంది పనిచేస్తున్న కేంద్ర స్కీమ్‌లకు ప్రభుత్వం నిధుల్లో కోత పెట్టిందని విమర్శించారు. కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, కె.గురునాయుడు, పట్టణ నాయకులు ఆర్.ప్రకాష్, నాగార్జున అగ్రికెమ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎల్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెవలస సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మండలంలోని కన్నెవలస సర్పంచ్ రావాడ రాజేష్ చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి రమణ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కన్నెవలస సర్పంచ్ రాజేష్ నిబంధనలకు విరుద్ధంగా నిధులు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులు రావడంతో డిఎల్‌పిఒ దర్యాప్తు చేపట్టి సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు.

దీనిపై సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించగా చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని తీర్పు వెలువరించింది. దీంతో సర్పంచ్ చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యారోగ్యశాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. జిల్లాలో అందుతున్న వైద్య సేవలు, నెలవారీ లక్ష్యాలు, ప్రగతి తదితర అంశాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామస్థాయి నుంచి వైద్య సేవలందించే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ గురించి తెలుసుకున్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వే, ఆయుష్మాన్ భారత్ సర్వే, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది సంఖ్య, ఖాళీల వివరాలు అడిగారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది పనితీరును మెరుగుపరచాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, మాతా శిశు మరణాల నివారణలో భాగంగా ప్రసవాలన్నీ ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో ఒపి సేవలు పెరగాలన్నారు. వైద్యాధికారులు పనితీరును మెరుగుపరుచుకుని ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు తమ పరిధిలోని గర్భిణులకు స్కానింగ్, గైనికాలజిస్ట్ వైద్య సేవలను ఉచితంగా అందించాలన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా అందించే వైద్య సదుపాలయాలను మరింత మంది సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, డిప్యూటీ డిఎంహెచ్ఒ ప్రసాదరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సి.పి శ్రీదేవి, డిపిఎంఒ వెంకటలక్ష్మి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త ప్రకాశరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఐటిడిఎ తీసుకొస్తా..

- నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం
- శంఖారావం సభలో లోకేష్

అభివాదం చేస్తున్న లోకేష్, టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, మెళియాపుట్టి

ఐటిడిఎ లేని జిల్లాగా ఉన్న శ్రీకాకుళానికి దాన్ని తీసుకొచ్చే బాధ్యత తనదని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. పాతపట్నంలో మంగళవారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. వంశధార నిర్వాసితులకు భూసేకరణ చట్టం అమలు చేస్తామని హామీనిచ్చి జగన్ మోసం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టిడిపి హయాంలో ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ప్రారంభిస్తే, ఇప్పుడు వాటిని ఆపేశారని విమర్శించారు. పాతపట్నం ప్రజలు రెడ్డి శాంతిని ఎమ్మెల్యేగా గెలిపించినా, ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. నియోజకవర్గానికి ఎవరేం చేశారో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ఇసుక దోపిడీ, పాఠశాల స్థలాన్ని ఆక్రమించి అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులనూ రెడ్డి శాంతి అమ్ముకుంటున్నారని చెప్పారు. పాతపట్నంకు పాలిటెక్నిక్ కళాశాలతో పాటు మొదటి రెండేళ్లలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. అనంతపురం జిల్లాకు కియా మాదిరిగా శ్రీకాకుళం జిల్లాకు పరిశ్రమలు తీసుకొస్తామని చెప్పారు. టిడిపి-జనసేన మధ్యలో చిచ్చుపెట్టేందుకు వైసిపి పేటిఎం బ్యాచ్ ప్రయత్నిస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా నుంచి వలస వెళ్లే వారిలో అత్యధికులు పాతపట్నం నియోజకవర్గం వారే ఉంటున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని లోకేష్‌ను కోరారు. వైసిపిని నమ్మి ఓట్లేసిన గిరిజనులను జగన్మోహన్‌రెడ్డి నిండా ముంచారని విమర్శించారు. పాతపట్నం రైల్వేస్టేషన్‌లో సమస్యలను కొన్నింటిని పరిష్కరించామని, రైల్వే మంత్రితో మాట్లాడి మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

వంశధార నిర్వాసితులకు మోసం

వంశధార నిర్వాసితులను ప్రభుత్వం అన్నిరకాలుగా మోసం చేసిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణ విమర్శించారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేస్తామని హామీనిచ్చి గాలికొదిలేశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైఖరితో ప్రజలు విసిగివేశారని విమర్శించారు. సభలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టిడిపి, జనసేన జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, పిసిని చంద్రమోహన్, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు, జనసేన పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు వినతులు

అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులను ప్రకటించి భర్తీ చేయాలని పలువురు నిరుద్యోగులు లోకేష్‌ను కోరారు. మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని ఆర్‌జియుకెటి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ విన్నవించారు. సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును రెగ్యులరైజ్ చేసి, పెన్షన్, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక సూచించారు. జనవరి 20 నుంచి ఈనెల 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా హెల్మెట్ ధారణపై మంగళవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీని స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. హెల్మెట్‌ను ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో మరణాలను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, నేషనల్ యూత్ ఫౌండేషన్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నివారణ

శ్రీకాకుళం అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయ అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. జనన ధ్రువపత్రాలతో పాటు వివాహాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఆస్తుల రిజిస్ట్రేషన్ తదితర చట్టాలపై ఎంపిఆర్ లా కళాశాల, అంబేద్కర్ యూనివర్సిటీలోని లా కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.వి గంగాధరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ట్రాఫిక్ నియమాలను విద్యార్థులకు వివరించారు. సబ్ రిజిస్ట్రార్ రవికుమార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి.వెంకటరావు, జిల్లా పంచాయతీ అధికారి పి.వెంకటేశ్వరరావు జనన, మరణ ధ్రువపత్రాల జారీపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిఆర్ లా కళాశాల ప్రిన్సిపల్ కె.మోషే, బిఆర్ఎయు లా కాలేజ్ ఫ్యాకల్టీ టంకాల బాలకృష్ణ, న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న ఇళ్ల స్థలాలకు సంబంధించి జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్ జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 535 జిఒలోని అన్ని నిబంధనలను పాటించి అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులకు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పొందుపరిచిన అర్హతలు, నిబంధనల ప్రకారం దరఖాస్తులు పూర్తి చేసిన వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు.

స్థల సేకరణకు ఆదేశం

ఐదేళ్ల అక్రిడేషన్ అనుభవం కలిగిన వారిని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది జాబితా మేరకు స్థలాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రాథమిక పరిశీలన తర్వాత జిల్లాకు 326 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని ఆర్‌డిఒ, సబ్ కలెక్టర్ కార్యాలయాలకు పంపించి పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. ఇళ్లస్థలాలు కేటాయించేందుకు అవసరమైన స్థలాన్ని సేకరించాలని ఆర్‌డిఒలను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస ఆర్‌డిఒ కార్యాలయ ప్రతినిధి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య కమిటీ సభ్యులు ఎస్.జోగినాయుడు, వి.సన్యాసినాయుడు, డిఐపిఆర్ఒ కె.చెన్నకేశవరావు, డిపిఆర్ఒ కె.బాలమాన్‌సింగ్, డివిజనల్ పిఆర్ఒ రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల వంటావార్పు

వంటావార్పుతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు కోర్టు వద్ద మంగళవారం వంటావార్పు చేపట్టిన నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మిభాయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన భూ హక్కు చట్టం న్యాయవాదులకు గొడ్డలిపెట్టువంటిదన్నారు. దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టంతో ప్రజల భూములు, స్థిరాస్తి హక్కులను న్యాయవ్యవస్థ పరిధి నుంచి తొలగించి రాజకీయ దళారులకు అప్పగించడమే ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు పలురూపాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని విమర్శించారు. ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు, న్యాయవాదులు పైడి వరాహనరసింహం, తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబెల్లి ప్రభాకరరావు, కిల్లి మార్కండేయులు, వి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి పాతపట్నం వారి కోర్టు లో
O.S. No. 12/2022

బిట్వీన్:
జామాన శ్యామసుందరరావు ...వాది
మరియు:
తూలుగు జగదీష్ ...ప్రతివాది

ప్రతివాదికి నోటీసు:

ప్రతివాది. అయిన తూలుగు జగదీష్ S/o లేటు లక్ష్మీనారాయణ, వయసు 38 సం॥లు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, R/o విద్యానగర్, పాతపట్నం గ్రామం/పోస్ట్/మండలం, శ్రీకాకుళం జిల్లా అనే ఆసామీ వారు పై నెంబరు దావాలో **తేది 22-02-2024 న ఉదయం 10.30 గం॥ లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై మీ ఆక్షేపనలు కోర్టులో తెలుపు కోవలెను. లేనియడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమయినది.

(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)

బి.ఇ. సత్యనారాయణ
వాది తరపు న్యాయవాది,
పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా.

'ప్రేమను ప్రేమతో ప్రేమగా ప్రేమిస్తే.. ప్రేమించ బడిన ప్రేమ ప్రేమించిన ప్రేమను ప్రేమతో ప్రేమిస్తుంది.' అని ఓ సినీ రచయిత చెప్పాడు.

గుప్పెడంత గుండె చెప్పలేనన్ని భావాల సమ్మేళనం. రెండక్షరాల ప్రేమ అంతులేని అనిర్వచనీయ భావాల సంగమం. అందుకే ప్రేమ బాసలకు 'హృదయాకారం' శాశ్వత చిహ్నంగా మారింది. ప్రేమ విశ్వజనీనమైనది. దాన్ని ఏ అడ్డుగోడలూ నిలువరించలేవు. రాజైనా.. పేదైనా ప్రేమకు అనర్హులు కారెవ్వరు. ప్రేమ ఆరాధనగా మారితే త్యాగానికైనా సిద్ధమవుతుంది. ప్రేమించిన వారి కోసం ఎండాకైనా ప్రయాణించే తెగింపు నేర్పుతుంది. చరిత్ర వదిలి వెళ్లిన నిజాలెన్నో ఇందుకు సాక్ష్యం. నిజమైన ప్రేమికుడు త్యాగాన్ని కోరుకుంటాడు. మనసు లోతుల్లోని ప్రేమ పెదవి దాటి హృదయం చేరాలంటే ఓ క్షణం కావాలి. ఆ క్షణం కోసం ఎదురు చూసే ప్రేమికులు ఏటా ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజుగా జరుపుకుంటారు.

లవర్స్ డే ఎలా వచ్చింది?

క్రీస్తుశకం 270లో రోమ్ సామ్రాజ్యాధిపతి కుమార్తెను వాలంటైన్ అనే సామాన్యుడు ప్రేమిస్తాడు. ఆమె కూడా ఆయన్ని ప్రేమిస్తుంది. వీరి ప్రేమ నచ్చని చక్రవర్తి బతికుండగానే వాలంటైన్‌ను సమాధి చేస్తాడు. ఈ సంఘటన జరిగింది ఫిబ్రవరి 14. ఈ విషయం విన్న యువరాణి కూడా ఆత్మహత్య చేసుకుంటుంది. వీరి ప్రేమను స్ఫురణకు తెస్తూ పాశ్చాత్య ప్రపంచం 'లవర్స్ డే'గా వేడుకలు నిర్వహిస్తోంది. ఎక్కువ మంది ఈ కథనే చెప్పుకుంటున్నారు.

ప్రేమ ఎంత మధురం

నేడు ప్రపంచ ప్రేమికుల దినోత్సవం

జీవితంలో ఓ భాగం ప్రేమ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మనిషి బాల్యం నుంచి ఎన్నో దశలను దాటుకుంటూ ఎదుగుతాడు. కాని తన హృదయాన్ని తాకే ప్రేమ మాయలో పడి అదే జీవితమనుకుని, అదే లేకపోతే జీవితం లేనట్టు భావిస్తూ... కోల్పోయిన ప్రేమను తలచుకుంటూ తమ ప్రాణాలను సైతం త్యాగం చేసుకుని తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కన్నవారిని, తోబుట్టిన వారిని, స్నేహితులను కన్నీటి సంద్రంలో ముంచెళ్లిపోతున్నారు. మిత్రమా... జీవితంలో ప్రేమనేది ఒక అందమైన అనుభవమే కావచ్చు... కాని ఒక్క విషయం ఎప్పటికీ మర్చిపోకూడదు. యవ్వన ప్రాయంలో మనసులో అలజడి రేపే ప్రేమే జీవితం కాదు. ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే. అందమైన ఈ లోకంలో ఎన్నో అనుభూతులు ఉన్నాయి. వాటిని మనసుపెట్టి ఆశ్వాదించేవారే ధన్యులు. జీవితంలో విజయం సాధిస్తే ప్రేమేంటి మిత్రమా... ఈ లోకమే నీ ప్రేమ కోసం పరితపిస్తుంది. నీ లక్ష్యం వైపుకు అడుగులు వెయ్యి... నీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారిని సంతోషపెట్టడంలోనే నిజమైన ఆనందం, ప్రేమ దాగుందనే అక్షర సత్యాన్ని ఎప్పటికీ మర్చిపోకు. పడినా లేచే కెరటాలను ఆదర్శంగా తీసుకుని విజయం వైపుకు నీ పయనాన్ని కొనసాగిస్తే మీరే విజేతలవుతారు.

ప్రేమను గెలవలేకపోయావని లక్ష్యాన్ని విడవకు. కుదిరితే పరిగెత్తు... లేకపోతే నడువు... అదీ చేతకాకపోతే పాకుతూ పో... అంతేకాని ఒకేచోట అలా కదలకుండా ఉండిపోకు. ప్రేమించిన వాళ్లు దూరం అయ్యారని అలాగే ఉండిపోతే ఎలా? దేహానికి తప్ప దాహానికి పనికిరాని ఆ సముద్రపు కెరటాలే ఎగసి ఎగసి పడుతుంటే... తలచుకుంటే నీ బతుకు ఇంతే అన్నవాళ్లు కూడా నీ ముందు తలదించుకునేలా చేయగల సత్తానీది. అలాంటిది ఇప్పుడొచ్చిన ఆ కాస్త కష్టానికే తలొంచేస్తే ఎలా?. సృష్టిలో చలనం ఉన్నది ఏదీ ఆగిపోకూడదు. పారే నది... వీచే గాలి... ఊగే చెట్టు... ఉదయించే సూర్యుడు... అనుకున్నది సాధించాలని నిలో కసికసిగా ప్రవహిస్తుందే ఆ నెత్తురుతో సహా ఏదీ ఆగిపోవడానికి వీల్లేదు. లే... బయలుదేరు... నిన్ను కదలనివ్వకుండా చేసిన ఆ మానసిక బాధల సంకెళ్లను తెంచుకో... పడ్డ చోటు నుంచే పరుగు మొదలుపెట్టు. నువ్వు నిద్రపోయే పరుపు నిన్ను చీదరించుకోక ముందే బద్ధకాన్ని వదిలేయ్. నీ అద్దం నిన్ను ప్రశ్నించకముందే సమాధానాన్ని వెతుక్కో. నీ నీడ నిన్ను వదిలేయక ముందే వెలుగులోకి వచ్చేయ్. మళ్లీ చెపుతున్నా... కన్నీళ్లు కారిస్తే కాదు చెమట చుక్కలు చిందిస్తేనే చరిత్రను రాయగలవని తెలుసుకో. చదివితే ఇవి పదాలు మాత్రమే, ఆచరిస్తే అస్త్రాలు అవుతాయి. మీ ప్రేమ విజయంవైపు అడుగులు వేయాలని ఆకాంక్షిస్తూ... అందరికీ ప్రేమికుల రోజు శుభాకాంక్షలు.

జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి

ప్రేమ వివాహం చేసుకోవడానికి ఇంతకంటే... గొప్పమార్గం ఉండదు అనేది మా భావన.. మేమిద్దరం మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చినవాళ్లం. ఇంటర్మీడియట్ వేర్వేరు ప్రాంతాల్లో పూర్తి చేసుకుని వచ్చాం. డిగ్రీలో పరిచయం అయ్యాం. క్లాసులో ఫస్ట్ రావడానికి మా ఇద్దరి మధ్యనే పోటీ. మొదటి ఏడాది ఫస్ట్ ఒకరికొస్తే, రెండో ఏడాది మరొకరికి ఫస్ట్ వచ్చేవాళ్లం. పోటాపోటీగా చదువుకున్న మేము జీవితాల్లో స్థిరపడాలని ప్రణాళిక వేశాం. ఆ తర్వాతే పెళ్లిళ్లు చేసుకోవాలని బహిరంగంగా చెప్పాం. ఎవరినో చేసుకోవడం ఎందుకు మీరిద్దరూ పెళ్లి చేసుకోండని మిత్రులు ప్రోత్సాహించారు. ఒకరి మీద మరొకరికి ఉన్న ఇష్టాన్ని పెళ్లిపీటల వరకూ తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగాలు వస్తేనే అని స్వీయ షరతు విధించుకున్నాం. ఉద్యోగాల్లో చేరిన తర్వాత కులాలు వేరైనా ఇరు పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. జీవితమంటే రెండున్నర గంటల సినిమా కాదు. పెళ్లైన నాటి నుంచి 60 ఏళ్ల భవిష్యత్ ప్రణాళిక. కాబట్టి ఆర్థికంగా సెటిల్ కాకుండా చేసుకునే పెళ్లిళ్లు ఫెయిల్యూర్ లవ్ స్టోరీగానే పరిగణించాలి.

-దుగ్గివలస రాంప్రసాద్, భవానీ, శ్రీకాకుళం

పెద్దలను ఒప్పించాం

'నాలుగు కళ్లు రెండు, రెండు మనసులు ఒక్కటయ్యాయని' ఓ కవి రాసినట్లు ఇద్దరు మనసు ఇచ్చుకున్న వ్యక్తులు మాత్రం ఒక జంటగా మారడానికి ఇరుపక్షాల వారికి అవగాహన అవసరం. టెక్కలి ప్రాంతానికి చెందిన మేము వేర్వేరు మతాలకు చెందిన వారుము. చదువుకునే రోజుల్లో ఒకరిని మరొకరు ఇష్టపడ్డాం. తమ ఇష్టాలను పెద్దలకు చెప్పి వాళ్లని ఒప్పించాలని భావించారు. ఆయితే ఇరు కుటుంబాల వారు కొంతకాలం అంగీకరించలేదు. దీంతో ఇచ్చిపుచ్చుకునే మనసులు కలవాలంటే గెలవాల్సింది మనుషులతో కాదు... మనసులతో అని గ్రహించాం. అంతవరకు వేచి ఉన్నాం. తరువాత కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ప్రేమికుల దినోత్సవం రోజునే నిశ్చితార్థం చేసుకున్నాం. ప్రస్తుతం ప్రస్తుతం అమీన్ నందిగాం మండలం నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందుమతి స్థానిక విశ్వజ్యోతీ డిగ్రీ కళాశాల్లో ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

- అమీన్, ఇందుమతి, టెక్కలి

ప్రేమించడమే నేరమా!

భాషలు వేరైనా బావాలు ఒక్కటే
మనసులు వేరైనా మమతాను రాగాలు ఒక్కటే
దారులు వేరైనా గమ్యం ఒక్కటే

నువ్వు నేను వేరైనా మన ప్రేమ ఒక్కటే.. అని అనుకున్నాడు ఓ యువకుడు. కులం, రంగు ముఖ్యం కాదు.. మనసు అని నమ్మాడు శ్రీకాంత్ (పేరు మార్చబడింది). అప్పు చేసి మరీ సినిమాలు, షికార్లుకు ప్రేయసిని తీసుకెళ్లాడు. ఖరీదైన గిఫ్ట్‌లు కొని ఇచ్చాడు. ప్రేయసి కూడా నువ్వే నా సర్వస్వం అని చెప్పగానే తనని తానే మైమరిచిపోయాడు. కొన్నాళ్ల హాయిగా సాగిన వీరి ప్రేమను మరో మెట్టు ఎక్కించే ప్రయత్నం చేశారు. తమను కన్న తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పారు. శ్రీకాంత్ తల్లిదండ్రులు కులాలు వేరు కావడంతో నో చెప్పారు. పెళ్లి వయస్సు నీకు ఇంకా రాలేదు. జీవితంలో స్థిరపడు తరువాత చూద్దామని చెప్పారు. ప్రేయసి ఇంట్లో పెళ్లికి ఒకే చెప్పారు. యువకుడు ప్రతి రోజూ తాను ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేయాలని తల్లిదండ్రులను వేధించడం సాగాడు. భోజనం తినకపోవడం, ఇంట్లో సామాన్లు బద్దలు కొట్టడం చేశాడు. అక్కడితో ఆగకుండా బ్లేడుతో చేతిని కోసుకోవడం, ఇంటి మేడపై నుంచి దూకడం ఇలా ఎన్ని ఉపాయాలు ఉంటే అన్నీ వాడేశాడు. చివరకు తల్లిదండ్రులు నీ సుఖం మాకు ముఖ్యం. నీకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకో.. నీకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇచ్చేస్తాం.. ఇంటికి దూరంగా.. వేరేగా బతుకు అని శ్రీకాంత్ తండ్రి కండీషన్ పెట్టారు. ప్రేమించడం సులభం. పెళ్లి చేసుకుని వచ్చిన అమ్మాయిని పెంచడం ఎంత కష్టమో తెలియాలనే ఆ తండ్రి ఆ షరతు విధించాడు. ఏం చెప్పాలో తెలియక జరిగిన విషయాన్ని యువతికి వెళ్లి యువకుడు చెప్పాడు. యువతి మాత్రం నీతో పాటు నీ కుటుంబం కావాలని, నీ సొంత ఇంట్లో ఉందాం. బయట వద్దని చెప్పింది. ప్రియుని ఆస్తిపై కన్నేసిందని తెలియక యువకుడు బ్లైండ్‌గా నమ్మేశాడు. చివరకు ప్రేమించిన వాడి కంటే ఎక్కువ ఆస్తి ఉందని మరో యువకుడిని పెళ్లి చేసుకుంది. విషయం తెలుసుకున్న ప్రియుడు ఆమె వద్దకు వెళ్లి ప్రశ్నించగా మీ ఇంట్లో వారు తనను బెదిరించారని నమ్మబలికింది. దీంతో దేవదాసుగా మారిన యువకునికి మూడు నెలల తరువాత ప్రేమించిన ఆమె ఫోన్ చేసింది. నా భర్త నను వేధిస్తున్నాడు. నీ వల్లే నేను గర్భం దాల్చాను. నన్ను మీ ఇంటికి తీసుకెళు అని ఆ ఫోన్ వచ్చింది. నా ప్రమేయం లేకుండా ఆమె గర్భం దాల్చడం ఏమిటని శ్రీకాంత్ సందేహించాడు. ఆమె ఇంటికి వెళ్లి మాట్లాడగా నీ వల్లే నేను గర్భం దాల్చాను. అభార్షన్ చేయించుకోడడానికి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆగ్రహించిన శ్రీకాంత్ నా తల్లిదండ్రుల కంటే నిన్ను పిచ్చిగా నమ్మాను. నాకు తగిన సాస్తి చేశావని అన్నాడు. నేను పైసా కూడా ఇవ్వను. నీకు నచ్చింది చేసుకో అని చెప్పి వచ్చేశాడు. ఆమె నువ్వు డబ్బులు ఇవ్వకుంటే మీ అమ్మా, నాన్నలను పోలీస్ స్టేషన్‌కు ఈడ్చుతానని బెదిరించింది. చివరకు తాను మోసపోయానని గ్రహించిన యువకుడు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఐ మిస్ యు అమ్మా, నాన్న. మిమ్మల్ని ఇన్నాళ్లు బాధపెట్టాను. నన్ను క్షమించడని వీడియో రికార్డు చేసి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ అంటేనే త్యాగం. కొందరు స్వార్థపూరిత ప్రేమ కోసం నిజమైన ప్రేమికులు క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆ ఒక్క క్షణం ఈ యువకుడు ఆలోచించి ఉంటే తల్లిదండ్రులకు పుత్ర శోకం మిగిలి ఉండేదికాదు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - కవిటి

విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని, ఇకపై ఇలాంటి నిర్లక్ష్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి డి.జి.పుట్టుగ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. 'సచివాలయ సిబ్బంది కోసం ఎదురుచూపులు' అంటూ మంగళవారం 'ప్రజాశక్తి' కథనం ప్రచురితమైంది. స్థానిక సిబ్బంది అలసత్వంతో సచివాలయం పరిధిలో పలు సమస్యలు ఎదురవుతున్నాయని, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పలువురు స్థానికులు ప్రజాశక్తి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ మంగళవారం డి.జి.పుట్టుగ సిబ్బందితో సమావేశమయ్యారు. స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుని సిబ్బందిని మందలించారు. ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలని సూచించారు.

కార్యదర్శులతో సమావేశం

మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సమావేశం నిర్వహించారు. డిడిఒలు వ్యవహరిస్తున్న కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. చాలా సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉండడంతో కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సచివాలయ పరిధిలో ఎటువంటి అవంతరాలు లేకుండా విధులు జరిగేలా చూడాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

సామాజిక తనిఖీ

టెక్కలి రూరల్ : మండలంలో 2022-23లో చేసిన ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌లో డొల్లతనం బయటపడింది. మండలంలోని ముఖలింగపురంలో ఐటిడిఎ ద్వారా జరిగిన పనుల్లో రూ.99 వేలు బిటి రోడ్డు వేసినట్లుగా చూపించినా... సామాజిక తనిఖీ సిబ్బంది వెళ్లేసరికి రోడ్డు నిర్మాణం పనులు జరగకుండా బిల్లు చేసినట్లు చూపించారు. మండలంలో జరిగిన రూ.13,30,67,911 పనులు జరగా... ఎక్కువగా హాజరు పట్టికలో తప్పులు ఉన్నాయని వెల్లడైంది. మొక్కలు పంచాయతీలో నాటినా... రక్షణ లేక మొక్కలు లేవని సామాజిక తనిఖీ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ద్వారా పొరపాట్లు జరిగితే వారు బాధ్యతలు అవుతారని హెచ్చరించారు. అలాగే జగనన్న కాలనీలో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, డిఇవిఒ. లవరాజు, ఎపిడి శైలజ, హెచ్.అర్.శ్రావణ, ఎస్ఆర్‌పి వెంకటరమణ, క్వాలిటీ కంట్రోల్ కె.గోవిందరావు, ఎపిఒ బాగాది ప్రసాదరావు పాల్గొన్నారు.

'శంఖారావం'ను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న సురేష్

లావేరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శాంఖారావం కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ పిలుపునిచ్చారు లావేరులో చంద్రశేఖర స్వామి కళ్యాణ మండపంలో మండలానికి చెందిన టిడిపి నాయకులతో, సర్పంచ్‌లతో, ఎంపిటిసితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న మధ్యాహ్నం మూడు గంటలకు లోకేష్ శంఖారావం సభకు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి ప్రధాన కార్యదర్శి పి.మధుబాబు, లంకలపల్లి బాబు, పెదకొత్తపల్లి సర్పంచ్ ఆరేళ్ల కృష్ణ, లంకలపల్లి శ్రీను, యినపకుర్తి రమణ, లంకలపల్లి ఆనంద్, దాము, మకాన మలేశ్వరరావు, కొరడ వెంకటరమణ, ఉప్పు జీవనందం పాల్గొన్నారు.

టిడిపి విజయానికి కృషి చేయాలి

టెక్కలి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నారా లోకేష్ పాల్గొన్న శంఖారావం సమావేశం విజయవంతానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి కార్యకర్తా మెజారిటీపై దృష్టిసారించాలన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, చాపల గణపతి, మామిడి రాము, ప్రసాద్‌రెడ్డి, లవకుమార్, ప్రీతిష్, మధు, కామేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శ

మండలంలోని గూడెంలో ఇటీవల పెట్ట రాము అనే బిఎస్ఎఫ్ జవాన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి ఉన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

కోటబొమ్మాళి : మండలంలోని పలు పంచాయతీలకు చెందిన వైసిపి నాయకులు ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో చేరారు. వీరికి మండలంలోని నిమ్మాడలో తన స్వగృహంలో మంగళవారం పార్టీ కండువ వేసి ఆహ్వానించారు. మండలంలోని లింగూడు పంచాయతీ

టిడిపి కండువా వేస్తున్న అచ్చెన్నాయుడు

రెడ్డిక సున్నాపల్లినుంచి బొంగు సూర్యారావు, 10వ వార్డు మెంబరు, పైల డిల్లేశ్వరరావు, బొంగు భరత్ రెడ్డి, మేఘవరం చలపతిరావు, పైల కృష్ణారావు తదితరులు, సంతబొమ్మాళి మండలం కోటపాడు పంచాయతీ నుంచి 2వ వార్డు మెంబరు చాట్ల లోకేశ్వరరావు, ఎ.వసంతరావు, ఐ.శాంతారావు, ఎల్.కాంతారావు, ఎన్.ఆదినారాయణతో పాటు పలుకుటుంబాలు చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - పలాస

చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ మెప్మా కార్యాలయంలో సిటీ మిషన్ మేనేజ్‌మెంట్ అధికారిగా పనిచేసిన ఎన్.జానకిరామారావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. పలాసలో పదేళ్ల పాటు చక్కని సేవలు అందించి అందరి మన్ననలు పొందారని అన్నారు. విధి నిర్వహణలో ఒక్కమాట పడకుండా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందారని అన్నారు. జానకిరామారావును స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలని కోరారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్‌కుమార్, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఐ.బి.రాము, బ్యాంకు లింకేజీ అధికారి వెంకటరావు, విజయకుమారి, భాస్కరరావు, మోహన్, స్వప్న, బి.సంతోష్‌మార్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న గిరిబాబు

రేపు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

టెక్కలి : స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15న నిర్వహించనున్న జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి ఒక ప్రకనలో తెలిపారు. 2022-23కు గాను జిల్లాలో ఎంపికైన పాఠశాలల నుంచి ప్రాజెక్టులు తయారు చేసుకుని విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టుల వ్యయం చెల్లిస్తామని అన్నారు. విద్యార్థులు ప్రాజెక్టుతో పాటు గైడ్ టీచర్ కూడా హాజరు కావాలని సూచించారు. సందేహాలు, నివృత్తికి జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామిని సంప్రదించాలన్నారు.

పొందూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిడిఒ దిక్కల తిరుమలరావు అన్నారు. మండలంలోని సైనూరులో గోవిందపురం ప్రాథమిక వైద్యాధికారి వాహినిప్రియాంక అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను పరిశీలించారు. ఈ శిబిరంలో 342 మంది రోగులకు ఉచితంగా బిపి, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, సిబ్బంది సన్యాసిరాజు, బి.తేజ్యం, తేజాలలిత, ప్రసాదరావు, గౌరి, ఊర్వశి, ఆదిలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రాపాకలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 313 మందికి బిపి, సుగర్ వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ కె.గిరిబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, పంచాయతీ సెక్రటరీ శాంతిస్వరూప్, వైద్యాధికారులు సుధీర్, అరుణ్, సుజాత పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న నాగశేషు

'ఐతమ్'కు ఐఎసిఇ అవార్డు

టెక్కలి రూరల్ : అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎసిఇ) సంస్థ 2022కు ఉత్తమ అధ్యాపక ఎపి ఛాప్టర్ అవార్డుకు టెక్కలి ఆదిత్య ఇనిస్టిటెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంపికైందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఈనెల 12న కర్ణాటక హెచ్కిఈఎస్-పిడిఎ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన 52వ జాతీయ అధ్యాపక సదస్సులో ఐఎసిఇ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ సిన్హా కాకాసా దేశాయ్, ఎపి సెక్షన్ చైర్మన్ ప్రొఫెసర్ జి.రంగ జనార్ధన్, ఎపి సెక్షన్ సెక్రటరీ ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి చేతుల మీదుగా ఐతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ టి.నాగేషు పాల్గొని జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐఎసిఇ ఎపి సెక్షన్ మేనేజింగ్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు.

సమయపాలనే విజయానికి తొలిమెట్టు

మాట్లాడుతున్న విసి రజని

ఎచ్చెర్ల: సమయపాలన, క్రమశిక్షణ కలిగిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్, విజయాలు చేరువులో ఉంటాయని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని అభిప్రాయపడ్డారు. 'వర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులు మంగళవారం నిర్వహించిన స్వాగత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంపస్ జీవితాన్ని ప్రణాళికాబద్ధకంగా మలుచుకొని మంచి కెరీర్ వైపు పయనించాలని సూచించారు. వర్సిటీకు మంచి పేరు తీసుకు వచ్చేలా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, విభాగం గౌరవ ఆచార్యులు టి.కామరాజు, విభాగ సమన్వయకర్త డాక్టర్ ఎస్.సంతోష్, రంగనాథ్ పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు మహిళల్లో ఆసక్తి

రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం అర్బన్ : రక్తదానం చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అన్నారు. నగర శివారుల్లో ఉన్న మునసబుపేట గురజాడ విద్యాసంస్థలో మంగళవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కళాశాల అధినేత స్వామినాయుడు, లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్ పాల్గొని రక్తదాతలకు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వల కొరత ఉందని, రక్త దాతలు సహృదయంతో ఆలోచించి యువతను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వామినాయుడు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పూలఖండం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు గాయత్రి విద్యాసంస్థల తరఫున రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, బిఇడి కళాశాల ప్రిన్సిపాల్ రంగారావు, గౌరీశంకర్, కంప్యూటర్ విభాగం నాయుడు, విద్యార్థి విభాగం కో-ఆర్డినేటర్ పొడుగు చరణ్, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు సిల్లా రమేష్, గిరిష్, లయన్స్‌క్లబ్ సెంట్రల్ ట్రెజరర్ శిల్లామణి, లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న గురజాడ విద్యార్థులు

'శంఖారావం' అట్టర్‌ఫ్లాప్

చింతాడ రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం నారా లోకేష్ ఆధ్వర్యాన నిర్వహించిన శంఖారావం సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శంఖారావం సభకు ప్రజలు ఎవరూ అంతగా హాజరు కాలేదని, వచ్చిన కాస్త జనం కూడా లోకేష్ మాట్లాడడం మొదలు పెట్టగానే అక్కడి నుండి లేచి వెళ్లిపోయారని అన్నారు. జగనన్న ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ముందు టిడిపి పార్టీ ఎన్ని సభలు, పర్యటనలు చేసిన ప్రజలు పట్టించుకోరని అన్నారు. లోకేష్‌ను ఎల్లో మీడియా ఎన్నో జాకీలెత్తి లేపినా ప్రజల్లో ఆదరణ లభించడం లేదని అన్నారు. శంఖారావం సభలు చూస్తుంటే రానున్న ఎన్నికల్లో టిడిపికి ఘోర పరాజయం తప్పదని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుందని అన్నారు.

జిఒ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - సోంపేట

ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో తిరిగి అప్రెంటిస్ విధానాన్ని ప్రకటించడం దారుణమని, పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయడం సరికాదని యుటిఎఫ్ నాయకులు అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అప్రెంటిస్ విధానాన్ని కొనసాగిస్తూ ఇచ్చిన పిఒ ప్రతులను మంగళవారం రాత్రి దహనం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు బాబూరావు, దాలయ్య, కూర్మారావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న గొండు శంకర్

300 రోజులకు 'అన్నా క్యాంటీన్'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేదలకు పట్టెడు అన్నం పెట్టాల న్న సంకల్పంతో చంద్రబాబు నెలకొల్పిన అన్నా క్యాంటీన్లను జగన్ ప్రభుత్వం అర్థాంతంగా మూసివేసి పేదలకు తీరని అన్యాయం చేసిందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆరోపించారు. ఆయన సొంత ఖర్చుతో అన్నా క్యాంటీన్ నెలకొల్పి మంగళవారానికి 300 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే చంద్రబాబు, లోకేష్ చిత్ర పటాలకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, ఇప్పిలి తిరుమల, రెడ్డి శంకర్, ముక్కళ్ల శ్రీను, గొండు వెంకట రమణమూర్తి పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

బాధిత కుటుంబానికి అండ

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అనారోగ్యంతో మృతి చెందిన ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ బెన్నయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఎస్‌పి జి.ఆర్ రాధిక భరోసానిచ్చారు. ఇటీవల మృతి చెందిన బెన్నయ్య కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన ఫ్లాగ్ ఫండ్ రూ.25 వేలు, విడో ఫండ్ రూ.50 వేలు చెక్కులను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెన్నాయ్య అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. రావల్సిన మిగిలిన ప్రయాజనలు త్వరగా అందేటట్టలు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అదేశించారు. ఎఒ సిహెచ్.గోపినాథ్, ఎఎఒ శోభారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై ఫిర్యాదు

పొందూరు :మేజరు పంచాయతీలో అత్యంత విలువైన ప్రదేశంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు పాల్పడుతున్నారని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని స్థలం కబ్జా కాకుండా కాపాడాలని పొందూరు సర్పంచ్ ఆర్.లక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. 45 ఏళ్ల క్రితం సర్వే నంబరు 192లో ప్రభుత్వం (ఎస్‌సి కార్పొరేషన్) జిరాయితీ స్థలం కొనుగోలు చేసి కొంతమంది దళితులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ళపట్టాలు ఇచ్చిందని అన్నారు. మిగిలిన స్థలాన్ని పిల్లల ఆటస్థలం, కమ్యూనిటీ భవనం, అంగన్వాడీ భవనం నిర్మాణానికి విడిచిపెట్టారని అన్నారు. ఆ స్థలాన్ని ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఇంకొక వ్యక్తి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై ప్రశ్నించిన విఆర్‌ఒ, కార్యదర్శులపై అట్రాసిటీ పేరుతో బెదిరిస్తున్నారని, తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేసి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్థానిక తహశీల్దార్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

లోకేష్ దృష్టికి యాదవుల సమస్యలు

ఆమదాలవలస : రాష్ట్రంలో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని యాదవ సంఘం జిల్లా కోకన్వీనర్ నాగళ్ల మురళీధర్ కోరారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు నారా లోకేష్ శంఖరావం సభ సందర్భంగా ఆయనను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశానని మంగళవారం తెలిపారు. పశు కాపరులుగా, తప్పెటగుళ్ల కళాకారులుగా జీవనోపాధి పొందుతున్న యాదవలకు 50 ఏళ్లకే పింఛను సౌకర్యం కల్పించాలన్నారు. కొండపోడు భూముల్లో గొర్రెల కాపరులుగా ఉంటూ అటవీ జంతువుల దాడులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రమాదాలు ఎదుర్కొంటున్న యాదవ కుటుంబాలను నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. తరచూ పశువులు, గొర్రెలు, మేకలు వివిధ ప్రమాదాలలో మృతి చెందడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటన్నారని, బాధితులకు బీమా చెల్లింపులు చేపట్టి ఆదుకోవాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న మురళీధర్

సిఎం రిలీఫ్‌ఫండ్ అందజేత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురానికి చెందిన ఉప్పాడ జగదీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్య ఖర్చులు నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రూ.2,20,000 మంజూరు కావడంతో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ జగదీష్ తల్లి పార్వతికి మంగళవారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన తమకు సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసిలు పూజారి సత్యం, బగాది దివాకర్‌లు సహాయ సహకారాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు పాల్గొన్నారు.

పథకాలను వివరించాలి

టెక్కలి రూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు కార్యకర్తలు వివరించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేటట్టు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చింతాడ గణపతిరావు, గురునాథ్ యాదవ్, తమ్మన్నగారి కిరణ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

లోకేష్ సభలో 'ఎంజిఆర్'

పాతపట్నం : పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం నిర్వహించిన శంఖారావంలో టిడిపి నియోజకవర్గం నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ముందుగా నాయకులతో, కార్యకర్తలతో, అభిమానులతో తన కార్యాలయం నుంచి సభా వేదిక వద్దకు భారీ ర్యాలీగా చేరుకున్నారు, అనంతరం జనసేన, టిడిపి నాయకులతో కలిసి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

లోకేష్ సభలో పాల్గొన్న గోవిందరావు

అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం వెంకటరావు

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

పొందూరు : విద్యార్థులు చిన్నప్పటి నుంచే వృత్తివిద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలిశెట్టి వెంకటరావు అన్నారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులకు లెర్నట్ స్కిల్స్ ఆధ్వర్యాన మంగళవారం వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ద్వారకామయి టైలరింగ్ సంస్థకు ఇండస్ట్రియల్ విజిట్‌ను నిర్వహించారు. వృత్తి విద్యా ఉపాధ్యాయులు దుంపల విజయలక్ష్మి, బి.సుధారాణి పాల్గొన్నారు.

తప్పులను సవరించాలి

రణస్థలం రూరల్: ఓటర్ లిస్టులో తప్పులను సవరించాల ని తహశీల్దార్ ఎల్.రామారావు ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో 87 మంది బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బిఎల్‌ఒ తుది ప్రచారణ అయిన ఓటర్ల జాబితాను పరిశీలించి మృతి చెందిన ఓటర్లు, డబల్ ఎంట్రీలు, మార్పులు, చేర్పులు, ఫారం-7, ఫొటోలు, చిరునామా, ఇంటి నంబరు సరిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

టెక్కలి: నిరుద్యోగ పోరాట సమితి టెక్కలిశాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు నిర్వహించిన జెఇఇ, నీట్, ఎంసెట్, వంటి పోటీ పరీక్షలు ఇటీవల నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు తలసముద్రం సూర్యం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై ఉండే భయాన్ని పారద్రోలడానికి ఇటువంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో బిఎస్‌జెఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు బ్రహ్మానందం, ప్రదీప్, ఆనంద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 15 నుంచి 17 వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి (డైరెక్ట్ నేషనల్) పోటీలకు డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14. ట్రైయాతలాన్ బాలికల విభాగంలో టి.వినీత ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే అండర్-16 బాలికల విభాగంలో టి.జయలక్ష్మి 600 మీటర్స్ రన్నింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే అరె-16 బాలురు హైజంప్ విభాగంలో డి.విస్సు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి సర్పంచ్ ప్రతినిధి బి.కళ్యాణ్, హెచ్‌ఎం జె.సరోజని, ఎంపిటిసి దున్న గురుమూర్తి, అధ్యాపకులు అభినందించారు. అలాగే వీరి ప్రయాణ నిమిత్తం పాఠశాల హెచ్‌ఎం రూ.2,500 అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఎన్ఇఆర్‌తో మాట్లాడుతున్న సిఐ రామచంద్రరావు

జాతర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కమ్మసిగడాంలో మహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ జాతర ఏర్పాట్లను జె.ఆర్.పురం సిఐ గుండపు రామచంద్రరావు, ఎస్ఐ కూన గోవిందరావు మంగళవారం పరిశీలించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులతో ట్రాఫిక్ ఎటువంటి ఇబ్బంది లేకుండా, యాత్రికులు సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా రూట్ మ్యాప్‌పై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వెలివేటి రాజ రవిచంద్ర, తేజు, వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి రాయుడు, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, గురాల రఘునాథ్ పాల్గొన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి

వజ్రపుకొత్తూరు : వైసిపి జయానికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చినవంకలో వైసిపి నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. పల్లిసారథి, చినవంక పంచాయతీల పరిధిలో రూ.5 కోట్లతో అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, మాజీ సర్పంచ్ సాన కృష్ణారావు, బగాది శ్రీకాంత్, సైని కేశవరావు, రెయ్యి శ్రీను, తమ్మినేని బాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉదయ్ కుమార్

వాహనాలను అడ్డుకున్న నాయకులు

వాహనాల అడ్డగింత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మహాదేవిపురం పోలినాయుడు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు అడ్డుకోవాలని అధికారులను పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వి.దుర్గారావు, టిడిపి నాయకులు శిషు సారథినాయుడు, కూన మోహనరావు, తమ్మినేని సుధాకరరావు, కూన షణ్ముఖరావు, తమ్మినేని బాబూరావు కోరారు. ఈ మేరకు పోలినాయుడు చెరువు నుంచి భారీ వాహనాలతో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఈవల సిమెంట్, తారు రోడ్లు వేశారని, భారీ వాహనాల వల్ల అవి అధ్వానంగా తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలపై పలాస ఆర్‌డిఒ, డిటి గిరిరాజుకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఇంటర్ దశ కీలకం

ప్రజాశక్తి- సోంపేట

విద్యార్థి జీవితంలో ఇంటర్ దశ కీలకమని సోంపేట ఎస్ఐ హైమావతి అన్నారు. సోంపేటలోని శివ గాయత్రి కళాశాలలో విద్యార్థులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా మహిళా గురించి తెలుసుకోవాలన్నారు. దిశ యాప్, ఇతర చట్టాలను అవసరార్థం ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. విద్యార్థులు బాగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు కోరారు. పరీక్షల సమయంలో వేళకు సరైన నిద్ర, ఆహారం తీసుకోవాలని జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. ప్రశ్నలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని జవాబులు రాయాలని హిందీ ఉపాధ్యాయులు పడాల తమ్మినాయుడు సూచించారు. ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కొండేటి వెంకటరావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూన పెంటయ్య, రమేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు కరవంజి చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.